క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు లేకుండా చర్యలు

విస్సన్నపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ కె. మాధురి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి మండల స్థాయి గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఏసీఎస్ సిబ్బందికి బుధవారం సమావేశం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ సీహెచ్ చిన్న రాట్నాలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలను పెంచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలో విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట బుధవారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవక ముందే ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని కూటమి ప్రభుత్వం మోపిందని విమర్శించారు. 2026లో మరో రూ.11 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం తప్పదని విద్యుత్ శాఖా మంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని, లేకుంటే నవంబర్ 3న జిల్లాలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఏడీఈకి వినతిపత్రం సమర్పించారు.

గొల్లపూడి బైపాస్‌లో ట్రాఫిక్ జాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రహదారిపై బుధవారం రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. గొల్లపూడి మైలురాయి సెంటర్ సమీపంలో పెద్ద గొయ్యి తీయడం, బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అక్కడ నీళ్లు చేరటంతో లారీలు, టిప్పర్లు, బస్సులు, కార్లు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. స్కూల్స్ వదిలే సమయం కావడంతో స్కూల్ బస్‌లు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ప్రతి రోజూ సమయానికి వచ్చే పిల్లలు ఇంకా రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ గేట్ వరకు పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. మైలురాయి సెంటర్‌లో బీటు నిర్వహించే పోలీసులు మినహా మరెవ్వరూ రాకపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చాలా సమయం పట్టింది.

రోడ్ల మార్జిన్లు ఆక్రమించి వ్యాపారాలు

- షాపులు, టిఫిన్ సెంటర్ల ఏర్పాటు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- కుంచించుకుపోతున్న రోడ్డు
- ట్రాఫిక్ సమస్యతో ప్రజల ఇబ్బందులు


బాలికల హైస్కూల్ వద్ద మార్జిన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు


వేంకటేశ్వరస్వామి కోవెల వద్ద రోడ్డు అంచులో ఏర్పాటు చేసిన షాపులు

నూజివీడు: నూజివీడు పట్టణంలోని రోడ్ల మార్జిన్లు, డ్రెయినేజీలను పలువురు ఆక్రమించి షాపులు ఏర్పాటు చేశారు. షాపులకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో రోడ్డు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పట్టణంలోని రహదారులు 60 ఏళ్ల కిందట నిర్మించారు. ఇవి 25 నుంచి 30 అడుగుల వెడల్పు మాత్రమే ఉంటాయి. మరికొన్ని రోడ్లయితే 20 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్నాయి. చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రద్దీగానే ఉంటుంది. ఈ కూడలిలో మార్జిన్లలో ఆటోలను నిలుపుతుండటంతో ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌ను ఆటో స్టాండు వాళ్లు ఆక్రమించేయడంతో వాహనాలను నిలిపేందుకు స్థలం లేక ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. శివాలయం సెంటర్‌లో టిఫిన్ సెంటర్లు రోడ్ల మార్జిన్లు, డ్రెయినేజీలపై పెట్టి నిర్వహిస్తుండడంతో అక్కడ సైతం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ ఆఫీసు సెంటర్‌లో సైతం నూడిల్స్ బండ్లు, టీ కొట్లు, కొబ్బరి బొండాల దుకాణాలన్నీ రోడ్డు మార్జిన్లలోనే ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వేంకటేశ్వర స్వామి కోవెల వద్ద ఇస్త్రీ దుకాణాలన్నీ షాపులను వదిలేసి డ్రెయినేజీలను ఆక్రమించి ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునేందుకు వీలు ఉండటం లేదు. జంక్షన్ రోడ్డులో పెట్రోలు బంకు ఎదురుగా రహదారి మార్జిన్‌ను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో పార్కింగ్‌కు స్థలం లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు అక్కడే ఆటోలను సైతం నిలిపి ఉంచుతున్నారు. మైలవరం రోడ్డులో బస్టాపు వద్ద ఆటోలను బస్టాపులోకి వెళ్లేందుకు వీలు లేకుండా రోడ్లపైనే నిలిపి వేస్తుండటంతో ఇక్కడ వాహనాలు తప్పుకోవడానికి వీలుండడం లేదు. తాతయ్యబాబు ఆస్పత్రి వద్ద సైతం కొబ్బరి బొండాలు, టీస్టాళ్లు డ్రెయినేజీపైనే ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల పార్కింగ్‌కు స్థలం ఉండటం లేదు.

ఆక్రమణలను తొలగించాలి



పట్టణంలోని రోడ్ల మార్జిన్‌లో, డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు కృషి చేయాలి. అప్పుడు ఎంతో కొంత ట్రాఫిక్ కష్టాలు తొలగుతాయి. యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారో తెలియడం లేదు.

– మహ్మద్ సుభానీ, నూజివీడు

అధికారులు దృష్టి సారించాలి



పట్టణంలో నిరంతరం ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలి. మార్జిన్లు, డ్రెయినేజీల ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్, పోలీసు అధికారులు దృష్టి సారించాలి. ఆక్రమణలన్నింటిని తొలగిస్తే కొంత మేరకు పరిస్థితి మెరుగవుతుంది.

– జి.విజయ్, నూజివీడు

అభివృద్ధికి నిధులు తీసుకువస్తా

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణా నదీ జలాలను పట్టణానికి సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, రహదారుల విస్తరణ కూడా చేయాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొండపల్లి–కొత్తగూడెం రైలు మార్గాన్ని తిరువూరు మీదుగా నిర్మించేందుకు కేంద్రం అనుమతించినందున నిధుల మంజూరుకు ఎంపీ కేశినేని శివనాథ్ ద్వారా తన వంతు కృషి చేస్తానన్నారు. వైస్ చైర్‌పర్సన్ వెంకటేశ్వరి శ్మశాన వాటికల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

అభివృద్ధి పనులకు ఆమోదం..

15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 51.62 లక్షలు మంజూరైనందున పనులు చేపట్టేందుకు కౌన్సిల్ తీర్మానించింది. పట్టణంలో కొత్త ఎల్ఈడీ వీధిలైట్ల ఏర్పాటుకు రూ.3.24 లక్షలు, రూ. 53 లక్షలతో 20 సీసీ రోడ్లు, అమృత్ పథకం కింద తాగునీటి సరఫరా పనులకు రూ.1.30 కోట్లు కేటాయిస్తూ తీర్మానించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణకు రూ. 62 వేలతో పుష్‌కార్టుల కొనుగోలుకు, సీసీ రహదారులు, బీటీ రోడ్లపై గుంతల పూడ్చివేతకు రూ.2 లక్షలు కేటాయించారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, దుర్గారావు, హుస్సేన్, సురేంద్ర, వెంకటరెడ్డి పలు సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించారు.

మారిన వాతావరణంతో రైతుల ఆందోళన

చాట్రాయి: బుధవారం మారిన వాతావరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 9వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. చాలా వరకు 1010 రకం వరి కోత దశకు రావడంతో యంత్రాల ద్వారా వరి కోతలు కోస్తున్నారు. కోసిన ధాన్యం ఆరు బయట ఉండడంతో వర్షం పడితే తడిసి పోతుందని బరకాలు కప్పుకున్నారు.

సాంకేతిక నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు అన్నారు. వాహినీ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం నిర్వహించిన సందర్భంగా బుధవారం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. పలు కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, షార్ట్ ఫిలిం విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇంజినీరింగ్ నిపుణుడు కరీంను కళాశాల నిర్వాహకులు సత్కరించారు.

రాయనపాడు మాజీ సర్పంచి నాగేశ్వరరావు మృతి



రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు మాజీ సర్పంచి కాటంనేని నాగేశ్వరరావు (92) బుధవారం మృతి చెందారు. ఆయన 1970–80 సంవత్సరం మధ్య కాలంలో సర్పంచిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

బాణసంచా దుకాణాల్లో సేల్స్‌ట్యాక్స్ అధికారుల తనిఖీ

నూజివీడు: పల్లెర్లమూడిలోని శ్రీ లక్ష్మీనారాయణ క్రాకర్స్ హోల్‌సేల్ దుకాణంలో బుధవారం ఏలూరు సెక్షన్‌కు చెందిన సెల్స్‌ట్యాక్స్ అసిసెంట్ కమిషనర్ ఎస్.రమాకిరణ్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. బిల్లులు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. డెప్యూటీ ఏసీ ధనేశ్వరరావు, జోగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట గళం సభ్యులు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజును కోరారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిప్రతాన్ని బుధవారం ఆయనకు అందజేశారు. ప్రజా పోరాట గళం కన్వీనర్ పసుమర్తి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ పాలిశెట్టి తేజ, సీపీఎం, ఎంసీపీఐ నాయకులు పాల్గొన్నారు.

6న వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

మైలవరం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం నవంబర్ 6న సాయంత్రం 4 గంటలకు మైలవరం నూజివీడు రోడ్డులోని చలువాది మల్లికార్జునరావు కల్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

మైలవరం: మైలవరం శ్రీ దుర్గా భవానీ టాక్సీ స్టాండ్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పత్తిపాటి రవికిరణ్, ఉపాధ్యక్షుడిగా కంచన పాండురంగారావు, కార్యదర్శిగా మల్లారపు గోపీ, కోశాధికారిగా గాళ్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మల్లారపు సాంబయ్యతో పాటు మరో ఐదుగురుని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రమిదల పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ అన్నారు. దీపావళి సందర్భంగా విద్యార్థులతో స్వయంగా తయారు చేయించిన ప్రమిదలను విద్యార్థులు, స్థానికులకు బుధవారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు.

- **తాగునీటి సరఫరా పునరుద్ధరణ**

గోపవరం(ముసునూరు): గోపవరంలో తాగునీటి సరఫరాను బుధవారం పునరుద్ధరించారు. యాదవ బజారు ఏరియాలో సోమవారం మంచినీటి మోటారు సప్లయ్ వాల్వు మొరాయించడంతో సర్పంచ్ కంచర్ల వాణి, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆ ప్రాంత ప్రజలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు. బుధవారం మధ్యాహ్నానికి వాల్వుకు మరమ్మతులు చేసి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు.

- **హెచ్‌ఎం రామరాజేశ్వరికి సన్మానం**

ముసునూరు: ఉపాధ్యాయ వృత్తి సమాజానికి దిక్సూచి వంటిదని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన గోగులంపాడు యూపీ స్కూల్ హెచ్‌ఎం రామరాజేశ్వరి సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా నేతలు జి.వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పద్మకిశోర్, రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంను ఘనంగా సత్కరించారు.

- **హుండీ కానుకల లెక్కింపు**

బలివే(ముసునూరు): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.1,32,191 ఆదాయం లభించిందని ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. బుధవారం ఆలయం వద్ద దేవదాయ శాఖ తనిఖీ అధికారి కె.అనూరాధ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు నుంచి బుధవారం వరకు లభించిన హుండీ కానుకలను లెక్కించారు. ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- **పంటల సాగులో మెలకువలు పాటించాలి**

నూజివీడు: పల్లెర్లమూడిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి రైతులకు వరి పంట సాగులో మెలకువలను వివరించారు. వర్షాలు కురిసే అవకాశాలున్నందున వాతావరణ పరిస్థితుల కనుగుణంగా వరి కోతలు చేపట్టాలన్నారు. అనంతరం ఉద్యాన అధికారి ఆర్.హేమ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో తెగుళ్ల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ హర్షియా తదితరులు పాల్గొన్నారు.

- **ఘనంగా జాతీయ ఏక్తా దివస్**

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ పాఠశాలలో జాతీయవాది, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏక్తా దివస్ ప్రాముఖ్యతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ రాక్‌ఫెల్లర్ విద్యార్థులకు వివరించారు. ఎన్‌సీసీ అధికారి ఆదిలక్ష్మి ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు చావా సతీష్, కొచ్చర్ల మోహనరావు, బోసుబాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

- **నిత్యావసర కిట్లు అందజేత**

నూజివీడు: రోటరీ ఇంటర్నేషనల్ ద్వారా రోటరీ

సంక్షిప్తంగా...

గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, రోటరీ పూర్వ గవర్నర్ దత్తా సుబ్బారావు, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ యడ్ల పార్థసారథి నేతృత్వంలో బుధవారం నూజివీడులోని రోటరీ ఆడిటోరియంలో వరద బాధిత 50 కుటుంబాలకు సుమారు లక్ష రూపాయలకు పైగా విలువైన నిత్యావసర కిట్లను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్, కార్యదర్శి కె.సత్యనారాయణ, సభ్యులు ముఖర్జీ, యార్లగడ్డ రాజగోపాల్, అనిల్, ఎం.శ్రీనివాస్, గొల్లపూడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

- **మద్యం దుకాణం వద్దని మహిళల ఆందోళన**

విస్సన్నపేట: నివాస ప్రాంతాల వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని బుధవారం సీపీఎం, మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదని ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక ఎ. కొండూరు రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు రంగా రాణి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

- **భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు**

ఆగిరిపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పోతవరప్పాడులో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మరియన్న, ఆర్ఐ యూనస్, మండల సర్వేయర్ గంగరాజు పాల్గొన్నారు.

- **నిబంధనలు పాటించాలి**

చాట్రాయి: బాణసంచా దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ అన్నారు. బుధవారం చనుబండ, చాట్రాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. బాణసంచా కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు నీరు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాల్సిందేనని నూజివీడు డీఎస్పీ కేవీఎస్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఆగిరిపల్లిలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎస్ఐ శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** ముసునూరు, చెక్కపల్లి, కాట్రేనిపాడు గ్రామాల్లోని బాణసంచా దుకాణాలను బుధవారం నూజివీడు డీఎస్పీ కేవీఎస్‌వీ ప్రసాద్ పరిశీలించారు. నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, ఎస్ఐ ఎ.చిరంజీవి పాల్గొన్నారు.

- **బాణసంచా దుకాణాల ఏర్పాటు**

తిరువూరు: దీపావళి సందర్భంగా తిరువూరు పట్టణంలో 13 బాణసంచా దుకాణాలకు ఆర్డీఓ మాధురి అనుమతి ఇచ్చారు. బైపాస్‌రోడ్డులోని దారా టౌన్‌షిప్‌లో ఈ దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణాలను బుధవారం తిరువూరు ఆర్డీఓ మాధురి తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన 13వ నంబరు దుకాణాన్ని తొలగించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్‌వీఎస్ మూర్తి తిరువూరులోని బాణసంచా దుకాణాల్లో నిబంధనలు అమలు తీరును తనిఖీ చేశారు.

- **ఉద్యోగాలకు 19 మంది ఎంపిక**

తిరువూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, డీఆర్డీఏ, సీడ్యాక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. జీనియస్ కన్సల్టెంట్, డీమార్ట్ తదితర సంస్థలు నిరుద్యోగ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించాయి. 67 మంది జాబ్‌మేళాలో పాల్గొనగా 19 మందిని ఎంపిక చేశామని కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- **భారీ వర్షానికి నేలకొరిగిన వరి పైరు**

ఎ్రరమాడు(తిరువూరు): మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలతో వరిపైరుకు నష్టం వాటిల్లింది. తిరువూరు, ఎ్రరమాడు గ్రామాల్లో 100 ఎకరాల్లో వరి పైరు నేలకొరగడంతో రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ర్యాలీ**

విస్సన్నపేట: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చిమట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్, వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.